# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### ఆ కష్టాలు మాకొద్దు

ఉమ్మడి పాలనలో కాంగ్రెస్ హయాంలో కరెంటు సరఫరా విషయంలో పడిన కష్టాలు మళ్లీ మాకొద్దు. వ్యవసాయానికి 3 గంటల కరెంటుపై అవగాహన ఉంటే ఇలా మాట్లాడుతారా? గతంలో రాత్రనకా.. పగలనకా పొలాల వద్ద ఉంటూ కరెంటు ఎప్పుడొస్తుందోనని ఎదురు చూశాం. మాకు ఇప్పుడే బాగుంది. బీఆర్ఎస్‌కే మా మద్దతు ఇస్తాం.

**- శ్రీకాంత్, అగ్గనూరు, యాలాల**



### గతంలోధర్నాలు చేశాం

కాంగ్రెస్ పాలనలో ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్లపై పెట్టి ధర్నాలు చేసిన రోజులు ఎన్నో ఉన్నాయి. వాళ్లు వ్యవసాయానికి ఇచ్చే మూడు గంటల కరెంటుతో రైతులకు మళ్లీ కష్టాలు మొదలవుతాయి. ఈ కరెంటుతో పంటలు ఎండుతాయి. గతంలో రాత్రి వేళల్లో మోటర్లు పెట్టడానికి వెళ్లి పాములు కరిచి ఎంతోమంది మృతి చెందారు.

**- నీరటి యాదయ్య, రైతు, మహ్మదాబాద్**



### అవగాహన ఉందా?

వ్యవసాయానికి నిరంతరం కరెంట్ అవసరం. ఎంత కరెంట్ అవసరమనేది రైతుకు మాత్రమే తెలుసు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి వ్యవసాయంపై అవగాహన లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ రైతులకు వ్యవసాయానికి 3గంటలే చాలని చెబుతున్నాడు. మూడు గంటల కరెంటు ఏ మాత్రం సరిపోదు.

**- టి.లక్ష్మయ్య, నాగసముందర్, ధారూరు**



### మీరూ వద్దు... మీ కరెంట్ వద్దు

మరోసారి అధికారంలోకి కాంగ్రెస్ వస్తే... పాత రోజులు రావడం ఖాయం. మూడు గంటల కరెంట్ అంటున్నారు.. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతదో. రోజంతా ఇబ్బందులు పడాల్సిందే. రాత్రి సమయంలో కరెంట్ వస్తే.. రైతులు కరెంట్ షాక్‌తో, పాము కాటుకో గురవ్వక తప్పదు. మీ కరెంట్ వద్దు.. మీ ప్రభుత్వం వద్దు.

**- మల్లేశం, మల్లారెడ్డిగూడ, మొమిన్‌పేట**



### 10హెచ్‌పీ మోటర్లు అంటే...

రైతులు పంటలకు 10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటే.. మోటర్లు.. పైపులు, స్టార్టర్లు, విద్యుత్ వైర్లకు కలిపి రూ.లక్షకు పైగా ఖర్చు అవుతుంది. ఒకేసారి అందరూ మొదలు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువ పడి ఫ్యూజులు ఎగిరిపోతాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయి. రైతులపై మోయలేని భారాన్ని మోపేందుకే కాంగ్రెస్ సిద్ధమవుతున్నది.

**- మొగులయ్య, చంద్రయాన్‌పల్లి, మోమిన్‌పేట**



### ఆగం కావాల్సిందే..

వ్యవసాయానికి 3 గంటల కరెంట్ అంటేనే రైతులు ఆగం కావాల్సిందే. ఈ మూడు గంటల కరెంటుతో ఒక మడి కూడా తడవదు. తిండి తిప్పలు లేకుండా పొలాలే వద్ద పడి గాపులు కాయాల్సిందే. ఆ మాట వింటేనే భయమేస్తున్నది. మాకు ఇప్పుడిచ్చే 24 గంటలే బాగుంది.

**- గొర్రకాడి మొగులయ్య, రైతు, పర్సాపూర్, కొడంగల్**

- **మళ్లీ మోటర్లు కాలుడు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడే ఉంటది**
- **నాడు పొలంవద్దే రైతు కుటుంబాలు**
- **చీకట్లో పాము కాట్లకు రైతులు బలి**
- **నాటి పరిస్థితి తల్చుకొని వణికిపోతున్న అన్నదాతలు**
- **సాగు పండుగ చేసుకోవాలో.. దండుగ చేసుకోవాలో.. నిర్ణయం రైతుల చేతుల్లోనే..**

## కాంగ్రెస్ వస్తే.. కటిక చీకటే



కాంగ్రెస్ పేరు చెబితేనే రైతన్న కన్నెర్రజేస్తున్నాడు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘంగా సాగిన కాంగ్రెస్ పాలనలో పడిన ఎడతెరిపి లేని కష్టాలను తలుచుకొని వణికిపోతున్నాడు. మూడు గంటల కరెంటు చాలన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలపై తెలంగాణ రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఇప్పుడు మళ్లీ మూడు గంటల కరెంటు పాట పాడుతున్న కాంగ్రెస్ పొరపాటున అధికారంలోకి వస్తే తమకు ప్రత్యక్ష నరకం తప్పదని తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం ఎలా చేస్తారని నిలదీస్తున్నారు. ఆ మోటర్లు పెట్టుకుంటే కరెంటు సరిపోతదా? బోర్లలో నీళ్లు ఊరుతాయా? నీటి ప్రెషర్‌ను పైపులు తట్టుకుంటయా? అని ప్రశ్నించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని అగమ్యగోచర కాలమది.. రాత్రిళ్లు కరెంటు కోసం పొలం కాడికి వెళ్లి పాములు కరిచి చనిపోయిన ఘటనలు కోకొల్లలు. రాత్రిపూట చేలల్లోనే గడిపిన ఆ కాళరాత్రుల కష్టాలు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నదని రైతన్నలు చెబుతున్నారు.

### పేద రైతులకు చేతకాదు



కాంగ్రెస్ వారు గెలిస్తే రైతులకు 10హెచ్‌పీ మోటర్లు పెడతామంటున్నారు. కానీ పేద రైతులకు 10 హెచ్‌పీ మోటర్లు కొనేందుకు డబ్బులు ఉండాలి. 24 గంటల విద్యుత్‌కు బదులుగా రైతులకు 3గంటల విద్యుత్ ఇస్తామని తెలియజేయడం కాంగ్రెస్ పార్టీ వారికి తగదు. రైతులకు అన్యాయం చేసేందుకు ఆ పార్టీ నడుం కట్టింది. 24గంటల పాటు సీఎం కేసీఆర్ రైతుల కోసం విద్యుత్ నిరంతరంగా ఇస్తున్నారు. రైతులకు మేలు చేసే సంక్షేమ పథకాలు ఉండాలి. రైతులకు అన్యాయం చేసే పథకాలు కాంగ్రెస్ పార్టీ తీసుకొస్తామనడం సరికాదు. నాడు వ్యవసాయం దండుగా అనుకునేవాళ్లం. బీఆర్ఎస్ ప్రభుత్వం 24గంటల విద్యుత్ ఇవ్వడంతో మూడు పంటలు పండించుకుంటున్నాం. అన్ని విధాలుగా ఈ ప్రభుత్వం ద్వారా రైతులకు మేలు కలుగుతున్నది.

**- గుండుమల్ల నర్సింహులు, రైతు, తిర్మలాపూర్, కులకచర్ల**

### బీడు పెట్టుకోవాల్సిందే..



రైతులకు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు ఇస్తే ఎకరం భూమి కంటే ఎక్కువ సాగు చేయడం సాధ్యం కాదు. ఈ మూడు గంటల కరెంటుతో రైతులు ఎంత భూమి ఉన్నా ఎకరా భూమి సాగు చేసుకొని మిగతాది బీడుగా ఉంచుకునే దుస్థితి వస్తది. గతంలో అరకొర కరెంటుతో నానా ఇబ్బందులు పడ్డ రైతులు తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇస్తున్న 24 గంటల కరెంటుతో విస్తారంగా రెండు పంటలు పండిస్తున్నారు. వ్యవసాయానికి ఎంత కరెంటు ఇస్తే ఎంత భూమి సాగవుతుందో తెలియని మూర్ఖులు చెప్పే మాటలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. ఇలాంటి నాయకులకు రైతులు తమ ఓటుతో బుద్ధి చెప్పాలి.

**- తెలుగు అనంతయ్య, రైతు, దోమ**

### 60ఏండ్ల నుంచి చూస్తున్నా..



గత ప్రభుత్వాలను 60 ఏండ్ల నుంచి చూస్తున్నా.. రైతుల బాధలు తెలిసిన వాళ్లు మూడు గంటల కరెంటు చాలు అని ఎవరూ మాట్లాడరు. అప్పట్లో రైతులను పట్టించుకున్న వారే లేదు. ఇప్పుడు 24 గంటలు ఇస్తుంటే.. మూడు గంటలే చాలని చెప్పడం విడ్డూరంగా ఉంది. మిమ్మల్ని నమ్మి మరోసారి మోసపోం.

**- దర్శ్మిది బాలప్ప, రైతు, పెద్దేముల్**



### రెండు పంటలు పండిస్తూ..

ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ ఇస్తుండడంతో రెండు పంటలు పండిస్తూ బాగుపడుతున్నాం. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందని చెప్పడం చాలా దుర్మార్గం. రైతులు బాగుపడడం కాంగ్రెసోళ్లకు ఇష్టం లేనట్లున్నది. 40 ఏండ్లు రైతుల రక్తం తాగింది సరిపోలేదా? కాంగ్రెస్ వాళ్లకు అధికారం ఇస్తే వ్యవసాయాన్ని, రైతులను దిక్కులేకుండా చేస్తారు.

**- సందప్ప, కొర్విచేడ్, బషీరాబాద్**



### కాంగ్రెసోళ్లకు తెల్వదు

వ్యవసాయానికి ఎన్ని గంటల కరెంటు సరిపోతుందో కాంగ్రెసోళ్లకు తెల్వదు. ఎకరా పొలానికి నీరు పారించడానికి ఎన్ని గంటల కరెంటు సరిపోతుందో తెలిస్తే ఇలా మూర్ఖంగా ఎలా మాట్లాడుతారు. 10హెచ్‌పీ మోటర్లు తీసుకుంటే మళ్లీ అప్పుల పాలు కావాల్సిందే. మాకు ఇప్పుడిచ్చే 24 గంటల కరెంటే బాగుంది. మా ఓటు సీఎం కేసీఆర్‌కే వేస్తాం. మరింత అభివృద్ధి చేస్తారు.

**- వీరన్న,రైతు, చీలాపూర్, పూడూరు**



### రైతులకే తెలుసు

ఎంత కరెంటు అవసరమో వ్యవసాయం చేసేటోళ్లకు మాత్రమే తెలుసు . గత ప్రభుత్వాల హయాంలో రాత్రి సమయంలో 3గంటలు, పగలు 3 గంటలు ఇచ్చేది. రాత్రి సమయంలో పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నోళ్లు చాలా మంది ఉన్నారు. 3హెచ్‌పీ మోటర్లతో పంట పొలాలకు నీరు సరిపోతున్నది. దాంతోనే పంటలు పండిస్తు న్నాం. మాకు కేసీఆర్ సారే ఉండాలి.

**- కావలి రాములు, రైతు, గోర్లోనిబావి, మద్దూర్ (కొత్తపల్లి)**



### గంట ఉండేది కాదు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో కారు చీకట్లు ఉండేవి. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు కనీసం గంట పాటు కరెంట్ సక్రమంగా ఉండేది కాదు. బోరుబావులు, బావుల వద్ద రైతులు కరెంట్ రాకకోసం ఎదురు చూసేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉచితంగా 24 గంటల కరెంట్ వస్తున్నది. దాంతో రైతులు సంతోషంగా ఉన్నారు. మరోసారి కాంగ్రెస్ రైతులను మోసం చేసేందుకు యత్నిస్తున్నది. ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

**- శివరాజ్, రైతు, ఉద్దండాపూర్, తాండూరు**



### రైతులకు భారం

10 హెచ్‌పీ మోటరు వాడకం అనేది ఎంతో ఖర్చుతో కూడుకున్నది. రూ.లక్షకు పైగా ఖర్చవుతుంది. ఇదంతా ఎవరు భరిస్తారు. 10 హెచ్‌పీ మోటరు వాడితే ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పని చేయవు. కేసీఆర్ పాలనలోనే కరెంటు మంచిగ వస్తున్నది. మూడు గంటల కరెంటు ఎంత మాత్రం ఎవుసానికి సరిపోదు. మాకు కేసీఆర్ సర్కారే కావాలి.

**- తులసీరాం నాయక్, దేవులానాయక్‌తండా, బొంరాస్‌పేట**